## క్లుప్తంగా

### ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే సండ్ర



**సత్తుపల్లి:** రంజాన్ మాసం సందర్భంగా సత్తుపల్లి జామె మసీద్‌లో ఆదివారం సాయంత్రం అజార్ ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. ముందుగా దువ్వాలో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీద్ సదర్ నాయబ్ రసూల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రఫీ, ఖాదర్‌పాషా, ఆయూబ్ పాషా, మధార్, అంకమరాజు, పవన్, అనీల్, వేణు, కృష్ణారావు పాల్గొన్నారు.

### జేఎల్ ఫలితాల్లో ప్రతిభ

**కొణిజర్ల:** మండలంలోని తుమ్మలపల్లికి చెందిన నిరుపేద దంపతులు మేదా రోశయ్య – వెంకటమ్మ దంపతుల కుమారుడు మేడా నాగరాజు జేఎల్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఆయన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాడు. దీంతో ఆయనను గ్రామస్తులు, తదితరులు అభినందించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కల్లూరు:** విద్యుత్ మరమ్మతుల కారణంగా కల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ వెంకట్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### పాలాభిషేకం



**ఎర్రుపాలెం: కాచారంలో భట్టి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు**

**ఎర్రుపాలెం/బోనకల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు కారణమై పీపుల్స్ మార్చ్ పాదయాత్రను భట్టి విక్రమార్క నిర్వహించి నేటికి రెండేళ్లు కావడంతో ఆదివారం మండలంలోని కాచారంలో, బోనకల్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో.. కాంగ్రెస్ నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గాలి దుర్గారావు మాట్లాడుతూ.. భట్టి 109 రోజుల పాటు 17జిల్లాలో 1,364 కిలో మీటర్లు పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మాజీ చైర్మన్ రామకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కిషోర్, నాగేశ్వరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తల్లాడ లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ అవార్డు

**తల్లాడ:** తల్లాడ లయన్స్‌క్లబ్‌కు రీజియన్‌లో విశిష్ట సేవలందించినందుకు గాను ఆదివారం ఉత్తమ క్లబ్‌గా అవార్డు అందజేశారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు మరో రెండు అవార్డులు వచ్చాయి. ఖమ్మంలో జరిగిన రీజియన్ సమావేశంలో ఈ అవార్డులను బహూకరించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆంజనేయులు అవార్డులు రావడంతో సభ్యులకు, పీఎస్‌టీలకు కృతజ్ఞతలు తెలిపారు.

### అనుచరుడి పాడె మోసిన మానవతారాయ్

**సత్తుపల్లి:** పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పసల ఏడుకొండలు శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు కొటూరి మానవతారాయ్ తన అనుచరుడి మృతదేహాన్ని సందర్శించి కాంగ్రెస్ కండువా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంతిమ యాత్రలో అతని పాడె మోశారు. కార్యక్రమంలో నాయకులు ఫజల్‌బాబా, కృష్ణ, వెంకటేశ్వరరావు, సమ్మద్ పాల్గొన్నారు.

### 'పది' విద్యార్థులకు వీడ్కోలు

**తల్లాడ:** స్థానిక బాలభారతి విద్యాయంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఎస్.దామోదరప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏ భయం లేకుండా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం ఇటీవల ప్రకటించిన గ్రూప్–2, గ్రూప్–3 ఫలితాల్లో విజయం సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థులు డి.వెంకటేశ్వరరావు, కె.ఉపేందర్‌రావు లను కేఎస్‌ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ సన్మానించారు. కార్యక్రమంలో తల్లాడ ఎస్సై కొండల్ రావు, కేఎస్‌ఎం విద్యా సంస్థల డైరెక్టర్ శ్రావణి, ప్రిన్సిపాల్ రామారావు, ఏఓ శశాంక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైరాలో జాతీయ రహదారి పక్కన వేసిన చెత్త



వైరా క్రాస్ రోడ్డులో ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకైన దృశ్యం

# సమస్యలతో సతమతం

**మున్సిపాలిటీ విలీన గ్రామాల్లో తీరని కష్టాలు**
- రెండు రోజులకోసారి తాగునీరు, చెత్తసేకరణ
- వీధి దీపాలపై పర్యవేక్షణ కరువు

**వైరా మున్సిపాలిటీ వివరాలు..**

| | |
|---|---|
| మున్సిపాలిటీ జనాభా | 37,000 |
| వార్డులు | 20 |
| కుటుంబాలు | 12,000 |

**వైరా:** మున్సిపాలిటీ ఏర్పడి ఎమిదేళ్లు గడుస్తుంది. 2018లో మేజర్ గ్రామ పంచాయతీగా వైరా మున్సిపాలిటీ రూపుదిద్దుకుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 31 వేల జనాభా ఉండగా ప్రస్తుతం 37 వేలకు చేరుకుంది. ఐదేళ్ల మున్సిపాలిటీ పాలక వర్గం ఉన్నప్పటికీ పట్టణ ప్రగతి నిధులు తప్పితే ఇక్కడ ఇతర నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా జరగడం లేదు. పారిశుద్ధ్యం కూడా నామమాత్రంగానే ఉంది. మున్సిపాలిటీలో చెత్త సేకరణ కోసం 6 ట్రాక్టర్లు, 8 చెత్త సేకరణ ఆటోలు ఉన్నాయి. కానీ రెండు రోజులకు ఒకసారి చెత్తను సేకరిస్తున్నారు.

**ప్రధాన సమస్యలు మచ్చుకు కొన్ని..**

మున్సిపాలిటీలో ప్రధానంగా విలీన గ్రామాలైన సోమవరం, గండగలపాడు, లాలాపురం, దిద్దిపూడి, పల్లిపాడు, సిద్ధిక్‌నగర్‌లోని బీసీకాలనీ. ఈ గ్రామాలు మున్సిపాలిటీ ఏర్పడక ముందు ఉన్న పంచాయతీల సమస్యలే ఇప్పటికి కొనసాగుతున్నాయి. ప్రధానంగా రెండు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా కావడం, ఎయిర్‌వాల్స్ లీకైతే వెంటనే మరమ్మత్తులు చేయకపోతే రెండు రోజులకు పైగా కూడా తాగునీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఇటీవల 1, 20వ వార్డులలో ఎయిర్ వాల్వు లీకవుతుండగా స్థానికులు మున్సిపాలిటీ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. ఇప్పటికి ఎయిర్ వాల్వు సమస్య కొనసాగుతుంది. అలాగే పెరిగిన జనాభాకు అనుగుణంగా ట్యాంకుల నిర్మాణం జరగలేదు. చెంతనే రిజర్వాయర్ ఉన్నప్పటికీ రెండు రోజులకు ఒకసారి తాగునీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. అందుకు ప్రధాన కారణంగా ఇంట్రా పైపు లైను నిర్మాణం జరగకపోవడం, మిషన్ భగీరథ మంచినీటి ప థకం ద్వారా నీరు మున్సిపాలిటీకి చెరుతున్నప్పటికీ సరిపడా ట్యాంకులు లేవు. ప్రస్తుతం తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు అమృత్ 2.2 పథకం పనులు నత్తనడక సాగుతున్నాయి. ఇంకా విలీన గ్రామాల్లో చెత్త సేకరణ కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదు. రెండు రోజులకు ఒకసారి స్వచ్ఛ ఆటోలు వస్తున్నప్పటికీ సేకరించిన చెత్త డంపింగ్ యార్డు లేకపోవడంతో ఊరి చివరలో డంప్ చేస్తున్నారు. వర్షాకాలంలో చెత్త సేకరణ, సేకరించిన చెత్తను సుమారు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న కొడవటిమెట్ట రెవెన్యూ వేయాలంటే వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. జాతీయ రహదారి పక్కనే ఉన్న స్టేజీపినపాక హైలెవల్ వంతెన కింద డంప్ చేస్తున్నారు. వీధి దీపాలు కూడా కాంట్రాక్టర్ చేతులో ఉండడంతో వీధి లైట్లు పోయాయంటే ఎల్‌ఈడీ దీపాలు కావడంతో మున్సిపల్ సిబ్బందే తాత్కాలిక మరమ్మత్తులు చేస్తున్నారే తప్ప.. పూర్తి స్థాయిలో మున్సిపల్ అజమాయిషీ లేకపోవడంతో దీపాల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. అదే విధంగా మున్సిపాలిటీలో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా వెంటాడుతుంది. అధికారులు స్పందిస్తేనే తప్ప వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవు.

**ఇబ్బందులు తొలగించాలి..**



ఎండకాలం వస్తే తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రతి ఏడాది ఇదే సమస్య ఉంటుంది. వచ్చే నీళ్ల రోజు ఇస్తే సౌకర్యవంతంగా ఉంటుంది. అధికారులు ఇబ్బందులు తొలగించాలి.

– జి.సుజాత, 1వ వార్డు

# వసూళ్లు ఫుల్.. అభివృద్ధి నిల్

సాక్షి ఫోకస్

**అభివృద్ధికి ఆమడ దూరంలో విలీన గ్రామాలు**

| గ్రామం | కుటుంబాలు | జనాభా |
|---|---|---|
| మడుపల్లి | 1,500 | 4,200 |
| జిలుగుమాడు | 600 | 2,200 |
| అంబారుపేట | 301 | 875 |
| ఇల్లెందులపాడు | 185 | 1,100 |

**మధిర:** మధి రను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు గతంలో మడుపల్లి, ఇల్లెందులపాడు, అంబారుపేట, జిలుగుమాడు గ్రామాలను విలీనం చేశారు. ఈ గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. మున్సిపాలిటీ గ్రేడ్ స్థాయిలో అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్నారు.. కానీ వారికి కల్పించాల్సిన సౌకర్యాలను మాత్రం మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పన్నుల విషయంలో వసూళ్లు ఫుల్.. అభివృద్ధి నిల్ అన్న చందంగా ఉంది.

**అధ్వానంగా పారిశుద్ధ్యం..**

మధిర మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కేవలం పట్టణంలో మాత్రమే కార్మికులు నాలుగు రోజులకోసారి చెత్త సేకరణ వాహనాలతో వివిధ ప్రాంతాల్లో తిరిగి చెత్త సేకరిస్తున్నారు. విలీన గ్రామాల్లో మాత్రం 15రోజులకు ఒకసారి కూడా చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ఇళ్లలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని, దీంతో పలువురు ఖాళీ ప్లాట్లలో, రోడ్లపై చెత్తను విసిరేస్తున్నారు. ఆ చెత్త కొద్దిపాటి డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. ఈ చెత్త కుప్పలను పందులు చిందరవందర చేసి మురికికూపంగా మారుస్తున్నాయి.



పూడుకుపోయిన డ్రైయినేజీ



ఇల్లెందులపాడులో రోడ్డును కమ్మేస్తున్న కంపచెట్లు

**పూడిన కాలువలు..**

పట్టణంలో కొన్ని ప్రాంతాల మినహా మురుగునీరు ముందుకు వెళ్లేందుకు కాలువలు ఉన్నాయి. కానీ విలీన గ్రామాల్లో చాలా వరకు సిమెంట్ రోడ్లు నిర్మించారు కానీ డ్రెయిన్ల నిర్మాణం జరగలేదు. దీంతో రోడ్లకిరువైపులా కంపచెట్లు మొలిచాయి. వానాకాలంలో వర్షపు నీరు రోడ్లపై నిలుస్తుంది. ఇల్లందులపాడులోని కొన్ని ఇళ్లలో నీరు నిల్వ ఉండటంతో పాటు.. ఇల్లందులపాడు, మడుపల్లి గ్రామాల్లో కొన్నిచోట్ల కాలువలు పూడిపోవడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు.

**పట్టించుకోవడం లేదు..**



మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా విలీన గ్రామాల్లో ప్రత్యేక ప్రణాళికతో చెత్తను సేకరించాలి. కాలువల్లో పూడిక తీయించాలి. పన్నులు వసూలు చేస్తున్నారు కానీ అందుకు తగినట్లుగా అభివృద్ధి జరగడం లేదు.

– కోట డేవిడ్, ఇల్లెందులపాడు

## ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



వైరా – నెమలి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**వైరా:** ప్రజలందరూ ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. ఆదివారం వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో.. వైరా నుంచి ఏపీలోని కృష్ణాజిల్లా నెమలి వరకు సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రం నెమలికి సరైన బస్సు సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ తర్వాత ఆయన వైరా పాత బస్టాండ్ సెంటర్ రాయాలయం షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, నారాయణరావు, వెంకటనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..**

**ఏన్కూరు:** అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని రేపల్లెవాడలో ఇందిరమ్మ ఇళ్లకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రేపల్లెవాడ గ్రామాన్ని పైలట్ పాజెక్ట్‌గా ఎంపిక చేసిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం ఏన్కూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరావు, కృష్ణప్రసాద్, నరేందర్, అశోక్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తల్లాడ: అప్పటి ఉపాధ్యాయులతో విద్యార్థులు



తల్లాడ: అరిటాకుల్లో భోజనం చేస్తున్న నాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

**తల్లాడ:** తల్లాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్‌కు చెందిన పది చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 37ఏళ్ల తరువాత పాఠశాలలో కలుసుకుని ఒకరినొకరు పలకరించుకున్నారు. వారంతా పర్యావరణ పరిరక్షణకై.. స్టీల్ వాటర్ బాటిళ్లను, రాగి గ్లాసులు, అరిటాకు విస్తర్లు, మట్టి పాత్రలు, కాగితం గ్లాసులను వినియోగించారు. వేదిక అలంకరణకు కూడా పచ్చిగడ్డి, వివిధ రకాలను పూలను వాడారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎం.శుభాకర్‌దాసు, జయలత, డి.హైమావతి, కిషోర్‌బాబు, ప్రస్తుత ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, సరోజిని దంపతులను శాలువా, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.

**కొదుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..**

**చింతకాని:** మండలంలోని కొదుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

**మధిర:** వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మీనరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని పేరు మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. నాయకులు ప్రసాదరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ముత్తయ్య, రాధాకృష్ణ, రాము పాల్గొన్నారు.

**స్విమ్మర్స్ ఆధ్వర్యంలో..**

మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధిర పెద్ద చెరువు కట్ట వద్ద పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించి.. ఆయన చిత్రపటానికి స్విమ్మర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు.

**కల్లూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో..**

**కల్లూరు:** పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్యులు నిర్వహించగా.. ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి చందర్‌రావు మాట్లాడారు. ఇకనైనా ప్రభుత్వం ఆ మహనీయుడి పేరుని మార్చవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంబాబు, శ్రీను, సీతారామారావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్లు ఆవిష్కరణ



చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**సత్తుపల్లిరూరల్:** నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికై ఈ నెల 28న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ కోరారు. ఆదివారం సత్తుపల్లి మండలంలోని గంగారంలో నిర్వహించిన సమావేశంలో చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, భవాని, వెంకట్రావ్, నాగేశ్వరరావు, పుల్లయ్య, ప్రసాద్, సత్యం పాల్గొన్నారు.

### రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**వైరా:** వైరా జగ్గయ్యపేట రోడ్డు నిర్మాణ పనుల్లో ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి సుబాబుల్ లోడుతో వెళ్తున్న ఓ లారీ మధిర రోడ్డులో రోడ్డుపై ఉన్న గుంటల వల్ల పల్టీ కొట్టి కర్రలన్నీ రోడ్డుపై పడి పోవడంతో సుమారు గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పక్కనే ఉన్న ఫంక్షన్ హాల్‌లో శుభకార్యానికి వచ్చిన వారంతా బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

### దిష్టిబొమ్మ దహనం హేయమైన చర్య

**మధిర:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని అసెంబ్లీలో ప్రశ్నించిన జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం హేయమైన చర్య అని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు శ్రీనివాసరావు, భాస్కర్ రెడ్డి తెలిపారు. స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు అప్పారావు, ఖురేషి, నాగేశ్వరరావు, రాంబాబు, సైదా తదితరులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్ నాయకుల దిష్టిబొమ్మ దహనం

అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిలు దళిత నాయకులు, ప్రజాప్రతినిధుల పట్ల అమర్యాదగా, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం మండల కేంద్రాల్లో, పార్టీ కార్యాలయాల్లో వారి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ..ఈ సందర్భంగా అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌ను ఏకవచనంతో మాట్లాడి సభ మర్యాదను మంటగలిపారని మండిపడ్డారు. తక్షణమే స్పీకర్‌కు క్షమాపన చెప్పాలన్నారు. దళితులంటే బీఆర్‌ఎస్ నాయకులకు ఎప్పుడూ చులకన భావమేనని, కిందిస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఇదే తంతు నడుస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

## ముగిసిన అంకమ్మతల్లి జాతర

**వైభవంగా అమ్మవారి కల్యాణం..**



శ్రీమహాలక్ష్మి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**ముదిగొండ:** మండలంలోని కమలాపురంలో శ్రీఅంకమ్మ జాతర సందర్భంగా మూడో రోజు ఆదివారం అంకమ్మతల్లి ఆలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు పూజలు నిర్వహించారు. అంకమ్మ మాలాధారణ ధరించిన 50మంది భక్తులు అయ్యగారిపల్లిలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురుస్వామి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని అయ్యగారిపల్లి, కమలాపురం గ్రామాల్లో ఊరేగింపుగా శ్రీఅంకమ్మతల్లి ఆలయానికి చేరుకుని ఇరుముళ్లు సమర్పించారు. రాత్రి ఆలయ ఆవరణలో రావిచెట్టుకు, వేప చెట్టుకు కల్యాణం చేశారు. అర్చకులు శ్రీమహాలక్ష్మి కల్యాణ క్రతువు లక్ష్మీనారాయణస్వామితో వైభవంగా నిర్వహించగా.. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయ కమిటీ బృందం భక్తులకు పులిహోర పంపిణీ చేశారు.

**ముగిసిన వీరభద్రస్వామి జాతర**

**కారేపల్లి:** మండలంలోని పోలంపల్లి గ్రామంలో కొలువుతీరిన శ్రీవీరభద్రస్వామి సమేత భద్రకాళి అమ్మవార్ల జాతరను మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం హోమగుండం, బోనాల సమర్పణ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారని ఆలయ ధర్మకర్త, పూజారి మూతి వీరభద్రం, అర్చకుడు అశోకచారి తెలిపారు.

### 19న ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన అభయాంజనేయస్వామి దేవాలయం

**వేంసూరు:** మండలంలోని లక్ష్మీ నారాయణపురంలో శ్రీ సత్య అభయాంజనేయస్వామి దేవస్థాన 19వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఆలయ వ్యవస్థాపకుడు కలకొడిమ లక్ష్మీనారాయణ, తొగడచెరు కృష్ణమూర్తి, బండి సత్యనారాయణరెడ్డిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 18, 19 తేదీల్లో దేవాలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 18న మంగళ తోరణాలు, స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, విఘ్నేశ్వర స్వామికి అభిషేకాలు, రాత్రి 8 గంటలకు వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం, 19న ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, 10.30 గంటలకు శ్రీ హనుమత్ కల్యాణం, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

**18న శివాలయంలో..**

**ఏన్కూరు:** మండల కేంద్రంలో శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయ 13వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాస్ చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పరిమితికి మించి వైద్యం చేయొద్దు..

**కారేపల్లి:** గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్యం చేయొద్దని, అత్యవసరమైతే పెద్దాస్పత్రులకు రిఫర్ చేయాలని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణంలో తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండల 26వ వార్షికోత్సవం నిర్వహించగా.. సీఐ పాల్గొని మాట్లాడారు. గ్రామీణ వైద్యులు ఐక్యంగా ఉండి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పల్లెల్లో వైద్య సేవా కార్యక్రమాలను విస్తరింపజేయాలన్నారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు (బీవీఆర్) మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో గ్రామీణ వైద్యులను గుర్తించి.. వారికి శిక్షణ ఇచ్చారని, ఇప్పుడు ఆ దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామీణ వైద్యుల సంక్షేమానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.రాజారాం, పర్నా ట్రస్ట్ చైర్మన్ పట్టాభిరామారావు, సంఘం మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి

### అవార్డు ప్రకటించాలి

**కారేపల్లి:** ఇటీవల భారీ వరదలకు వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన సింగరేణి మండలం గంగారంతండా గ్రామానికి చెందిన తండ్రి మోతిలాల్, కుమార్తె డాక్టర్ అశ్విని మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా.. ఆదివారం గంగారంతండా గ్రామంలో బాధితుల కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ సఫావత్ రాములునాయక్ పరామర్శించారు. అనంతరం కారేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ఆణిముత్యం, అగ్రికల్చర్ సైంటిస్ట్ అశ్విని మృతి చెందటం బాధాకరమని, ప్రతీఏటా అగ్రికల్చర్ సైంటిస్ట్ అశ్విని పేరుతో అవార్డు ప్రకటించాలన్నారు. ఆల్ ఇండియా లంబాడ సేవా సమితి ఆధ్వర్యంలో సంబంధిత యూనివర్సిటీకి రూ.5లక్షలు డిపాజిట్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రామ్మూర్తినాయక్, భద్రునాయక్, ఐలయ్య, భీముడు, గోపాల్, జానీ, రాంబాబు, బావ్‌సింగ్, సుధాకర్ పాల్గొన్నారు.

### పరామర్శ..

**ముదిగొండ:** మండలంలోని మేడేపల్లికి చెందిన మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి నాగమణి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా.. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, లింగాల కమల్‌రాజ్ ఆమె చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. హరిప్రసాద్‌ను పరామర్శించారు. నాయకులు ప్రసాద్, సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, మల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.